# ద్రాస్ సింహం

1999 సంవత్సరం.

జూన్ 12 వ తేదీ. అర్ధరాత్రి గం. 12-30 లు.

కాశ్మీర్ సరిహద్దుల్లోని ద్రాస్ సెక్టార్. వేలాది అడుగుల ఎత్తుగా నిలబడి, మంచుశీర్షాలతో గంభీరంగా ఉన్న పర్వతశ్రేణి కేసి మేజర్ వివేక్ గుప్తా పరిశీలనగా చూసాడు.

భారతదేశానికి ప్రకృతివరంగా లభించిన అభేద్యమైన అగడ్తలు, రక్తాన్ని గడ్డకట్టించే మంచుగాలులూ శత్రువులకు వెరపు కలిగిస్తాయి. కానీ ఇప్పుడా పర్వత శిఖిరాగ్రాల మీద శత్రువులు తిష్టవేసుక్కూర్చున్నారు. బలమైన బంక



కాటూరు రవీంద్రత్రివిక్రమ్

# సిపాయి కథలు

ర్లు నిర్మించుకుని, భారత సైనికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కాశ్మీర్‌ని దురాక్రమణ ద్వారా హస్తగతం చేసుకోవడానికి సర్వ ప్రయత్నాలూ చేస్తున్నారు.

భారత సైన్యానికిది ఊహించని ఉత్పాతం.

శాంతిమంత్రాలు వల్లిస్తూ, అదే సమయంలో దురాక్రమణ చేయడం చైనా అనుసరించే కుటిలనీతి. ఇప్పుడు పాకిస్థాన్ కూడా అదే బాటలో పయనిస్తోంది. ఒక ప్రక్క నవాజ్ షరీఫ్ భారత ప్రధానితో లాహోర్‌లో శాంతి చర్చలు జరుపుతూండగా, మరోప్రక్క జనరల్ ముషర్రఫ్ కార్గిల్‌ని తన గుప్పి



ట్లో బిగించాడు. చొరబాటుదారుల్ని ప్రథమ శ్రేణిలో ఉంచి, వారితో మమేకమై పాకిస్థాన్ సైన్యం సూటిగా భారతస్థావరాలపైన ఫిరంగి గుళ్లు, తుపాకీ తూటాల వర్షం కురిపిస్తోంది. ఈ అకస్మాత్తు దాడిలో భారీగా నష్టాలు చవిచూడాల్సివచ్చింది. ఆయుధ డిపోలు ధ్వంసమైనాయి. ఎందరో వీరజవాన్లు తూటాలకు ఆహూతులైపోయారు. మరెందరో క్షతగాత్రులైనారు. మిత్రత్వపు మత్తులో జోగు తున్న భారత్ ఒక్కసారి కళ్లు తెరిచింది. జరిగిన ఘోరాన్ని గ్రహించి, తన యావచ్ఛక్తినీ వినియోగించి శత్రువు మీద ఎదురుదాడికి దిగింది.

కానీ ప్రతికూల పరిస్థితులు అడుగడుగునా అవరోధాలుగా నిలిచాయి. కొండకొన మీద శత్రువులు. వాళ్ల తుపాకులకు చక్కని గురి. ఎదురు కాల్పులకు ఎంతో సహజరక్షణ. భారత సైన్యం ఏమాత్రం అనువుగా లేని, దాదాపు నిట్టనిలువుగా ఉన్న పర్వతాలను అధిరోహించాలి. పైనుంచి కురుస్తున్న తూటాల వర్షాన్ని తప్పించుకుంటూ అడుగడుగూ పైకి ఎగబ్రాకాలి. ఇలాంటి భయంకరమైన యుద్ధానుభవం గతంలో ఎప్పుడూ ఎదురుకాలేదు. అలాగని వెనకడుగు వేసే ప్రసక్తి లేదు. ఎందరు వీర స్వర్గమలంకరించినా విజయాన్ని సాధించి తీరాలి.

ఈ సుస్థిర నిర్ణయంతో భారతసైన్యం ముందుకు సాగుతోంది.

మేజర్ గుప్తా తన సహచరులతో బాటు శత్రువు మీద దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. కంపెనీ కమాండర్‌గా యుద్ధరంగంలో అతను తనకు తానుగా వ్యూహరచన చేసుకోవాలి. ఏ చిన్న పొరబాటు జరిగినా ప్రాణాలకే ప్రమాదం.

కొండ పైనుంచి అప్పుడప్పుడూ తూటాల వర్షం కురుస్తోంది. శత్రువుల దగ్గర చీకట్లో చూసే 'నైట్‌విజన్ బైనాక్యులర్స్', మనుషుల కదలికల్ని పసిగట్టే 'సెన్సర్స్' ఉన్నాయి. కాబట్టి వాళ్లను ఏమార్చటం ఎంతో కష్టం. మొండి ధైర్యంతో, అన్నిటికీ తెగించి ముందుకు దూసుకువెళ్లడమే కర్తవ్యం. అలా చేయాలనేదే గుప్తా నిర్ణయం. అయితే ఏదో ఒక సమయం లో శత్రువు ఆదమరచి ఉండడా అని ఎదురు చూస్తున్నాడు. తూటాలు దూసుకురావడం ఏదో ఒక సమయంలో ఆగకపోతాయా అని ఆశగా నిరీక్షిస్తున్నాడు.

దట్టంగా మంచు కురుస్తోంది.

అలాంటి సమయాల్లో బ్రాందీ తాగటమో, సిగరెట్ పీల్చడమో చేస్తుంటారు. మొదటిది పరిమితంగా తీసుకోవచ్చు. కేవలం శరీరంలో వేడి కలిగించడానికి. రెండోది యుద్ధరంగంలో పూర్తిగా నిషిద్ధం. సిగరెట్ వెలిగించుకునే కాంతి, కొస ఎర్రదనం శత్రువు కంటపడే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగ్రతని పసిగట్టే 'సెన్సర్స్', ఎలాంటి ఉష్ణాన్నయినా పసిగడ తాయి. సిపాయిలు యీ విషయాన్ని మర్చి పోరు. ఎంతో సురక్షితం అనుకుంటే తప్ప సిగరెట్ వెలిగించరు.

మేజర్ గుప్తా మనసు ఒకసారి గతాన్ని గుర్తు చేసుకుంది.

తండ్రి లెఫ్టినెంట్ కల్నల్ గుప్తా ఆర్మీలో విలువైన సేవలందించి రిటైరయ్యాడు. ఆయన సర్వీసులో ఉన్నప్పుడే తను జన్మించాడు. చిన్న ప్పట్నుంచీ మిలటరీ వాతావరణంలో పెరగ డంతో సహజంగానే గుప్తా దానికి బాగా అల వాటు పడిపోయాడు. యూనిఫారంలోని సిపా యిలు ఠీవిగా సంచరించడం, తన తండ్రి కనిపించినప్పుడు ఠకీమని 'శాల్యూట్' చేయడం

సిపాయిలు దేశమాతకి ముద్దు పాపాయిలు. ప్రాణాలను పణంగా పెట్టి, మన సరిహద్దుల్ని సదా రక్షిస్తూంటారు. వారి వీరగాథలు యువతకి ఆదర్శం, స్ఫూర్తిదాయకం కావాలి.

ఈ కథలు వాస్తవ సంఘటనల నేపథ్యంతో రచించబడ్డాయి. రచయిత శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ 1964 నుంచి 1980 వరకు (16 సం॥లు) వైమానిక దళంలో పనిచేసిన కాలంలో స్వయంగా రెండు యుద్ధాలలో పాల్గొన్నారు. మిలట్రీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అనేక మంది యుద్ధ వీరుల విజయగాథల గురించి వివరాలు సేకరించారు. యుద్ధరంగం వేదికగా, దేశభక్తి ఊపిరిగా, త్రివిధ దళాల యుద్ధవీరులు సజీవ పాత్రలుగా వెలువడుతున్న ఈ ప్రత్యేక కథలు 'కథాకేళి' పాఠకులకు ప్రత్యేకం.

అతనెంతో ఆసక్తిగా చూసేవాడు. తను కూడా తండ్రిలాగా మిలట్రీలో ఉన్నతస్థాయికి ఎదగా లని ఉవ్విళ్లూరసాగేడు.

రిటైరైన తరువాత 'ఇండియన్ మిలటరీ అకాడమీ' ఉన్న డెహ్రాడూన్‌లో సకుటుంబంగా తండ్రి స్థిరపడడంతో తన ఆలోచనలకు రూపకల్పన జరిగింది. తరచుగా అకాడమీలో ఉన్న ఈతకొలనుకి వెళ్లి అక్కడి కేడెట్స్‌తో స్నేహం చేస్తుండేవాడు. తనని మిత్రులు ఆప్యా యంగా 'విక్కీ' అని పిలిచేవారు. తన మిత్రుల్లో అనూప్‌కుమార్ అత్యంత ఆప్తుడు. ఇద్దరూ కలుసుకున్నప్పుడల్లా సైన్యంలో సాహసోపే తమైన జీవితం గురించే తను చర్చించేవాడు. అతను తన కాలేజి సహాధ్యాయి. సౌమ్యుడు. నిజాయితీగల మిత్రుడు. తనని ఎప్పుడూ అభినందిస్తూ, ప్రోత్సహిస్తూండేవాడు.

ఆ ప్రోత్సాహంతోనే 1992 జూన్ 13 న 2వ రాజ్‌పుతానా రైఫుల్స్‌లో చేరాడు. శిక్షణ సమయంలోను, ఆ తరువాత తన మెరిట్‌ని రుజువు చేసుకుంటూ క్రమంగా మేజర్‌హో

దాకు ఎదిగాడు. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో పట్టభద్రుడైన తను ఆ అకాడమీ గౌరవాన్నీ ఘనతనీ అన్నివేళలా కాపాడుతూండేవాడు.

అకాడమీ వార్షికోత్సవాలకు ప్రిన్సిపాల్ తనను ప్రత్యేకంగా ఆహ్వానించి, అభినందించి గౌరవిస్తూండేవారు. తండ్రి ఆ దృశ్యాన్ని చూసి, మందహాసం చాటున మనోభావాలు దాచుకునేవాడు. లోలోపల ఆయన ఎంతో గర్వపడుతున్నట్లు తనకి తెలుసు.

అమ్మ...

ఆ రెండక్షరాలలో అనంతమైన ప్రేమామృతం నిక్షిప్తమై ఉంది. అమ్మ ముందు తనెప్పుడూ పసివాడే. కొసరి కొసరి తినిపిస్తూ, చేతుల్తో ఆప్యాయంగా తలని తడుముతూ, హృదయానికి ప్రేమగా హత్తుకుంటూ – అమ్మ నవ్వుతూ, నవ్విస్తూ... ఎప్పుడూ తన హృదయంలోనే నివసిస్తూంటుంది, స్మృతిమూర్తిగా.

మేజర్ వివేక్ కళ్లు తుడుచుకున్నాడు.

"భగవాన్! జన్మజన్మలకీ నాకు ఆ అమ్మనే ప్రసాదించు" అని మౌనంగా ప్రార్థించాడు.

పై నుంచి మళ్లీ కాల్పులు... విసుగ్గా కొండ మీదకు చూసాడు వివేక్.

ఇంకా ఎంతసేపిలా నిరీక్షణలో ఉండాలి?

రేడియమ్ వాచ్‌కేసి చూసాడు. ఒంటిగంట దాటింది. తన సహచరుల కేసి చూసాడు. వాళ్ళు ఆసక్తిగా అతని ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు.

"మిత్రులారా! మనం శత్రువుల స్థావరాల్ని పట్టుకోవాలంటే మొక్కవోని ధైర్యంతో బాటు సహనం, ఉపాయం కూడా కావాలి. సాధ్యమైనంత వరకూ మనం వాళ్ల తూటాలకి బలి కాకుండా కాపాడుకుంటూ వాళ్లని జయించాలి. లేకపోతే మన మీద దేశం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేసిన వాళ్లమౌతాము..."

"అవును సాబ్! శత్రువుల్ని జయించాలంటే మనల్ని మనం కాపాడుకుంటేనే సాధ్యపడుతుంది. మనం తప్పక విజయం సాధించాలి. సాధిస్తాం సార్..."

మేజర్ వివేక్ అభినందనగా అతని భుజం తట్టాడు.

అంతలో వైర్లెస్ మ్రోగింది.

"సర్... మేజర్ వివేక్ "

"వివేక్! ప్రస్తుత పరిస్థితి ఏమిటి?" కమేండర్ ప్రశ్న.

"శిఖరం పైనుంచి కాల్పులు కొనసాగుతున్నాయి సార్. మేము అవకాశం కోసం నిరీక్షిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనైనా అరగంటలో మా దాడి ప్రారంభిస్తాం..."

"వెరీ గుడ్! ఎప్పటికప్పుడు నాకు పరిస్థితి తెలియజేస్తూ ఉండు..."

"అలాగే సార్..."

"విన్నారుగా? మనం మరికాసేపటిలో దాడి ప్రారంభించాలి" సహచరులతో అన్నాడు వివేక్.

"అలాగే సార్..." అన్నారు వాళ్లు ఉత్సాహంగా.

మళ్లీ నిశ్శబ్దం. వివేక్ మళ్ళీ ఆలోచనల్లో పడిపోయాడు. అతనికి భార్య రాజశ్రీ గుర్తొచ్చింది. 1997 జూన్‌లో తమ వివాహం అయింది. తను కూడా ఆర్మీలో కెప్టెన్‌గా చేరింది. ఇద్దరూ ఏకాంతంగా గడపడానికి అవకాశాలు తక్కువగా ఉండేవి. ఇద్దరికీ చెరొక చోట పోస్టింగ్. తల్లి కావాలని ఆమెకు గట్టి కోరిక ఉండేది. కారణాలేమైతేనేం అది జరగలేదు. స్వభావరీత్యా ఆమె సెన్సిటివ్. అందువల్ల ఉల్లాసంగా గడిపే సమయాలు ఉండేవి



మేజర్ వివేక్‌గుప్త



భర్తకు చివరి వీడ్కోలిస్తున్న మేజర్‌గుప్త అర్ధాంగి కెప్టెన్ రాజశ్రీ బిష్ట్.

కాదు... – వివేక్ గట్టిగా నిట్టూర్చేడు. అయితేనేం – మనుషులెంత దూరమో, మనసులంత చేరువ!

తనని కంపెనీ కమేండర్‌గా యుద్ధరంగానికి పంపుతున్న రోజున తండ్రికి ఆనందంగా ఉత్తరం రాసాడు. ఆ రోజు జూన్ 8వ తేదీ.

"నాన్నగారూ! మీరు నన్ను చూసి గర్వపడాలి. ఈ యూనిఫారంలో దేశం కోసం నావంతు సేవలు చేయగలుగుతున్నాను. చరిత్రలో ఈ కీలకక్షణంలో కంపెనీ కమేండర్ కావడమనేది మహత్తర అనుభవం".

బహుశా తన ఉత్తరం డెహ్రాడూన్‌కింకా చేరి ఉండదు.

"సాబ్! ఫైరింగ్ ఆగిపోయింది. మనం దాడి ప్రారంభిద్దామా?" పర్వతం పైకి చూస్తూ అన్నాడు సహచరుడు. వివేక్ ప్రస్తుతంలోకి వచ్చాడు.

"యస్! పదండి పైకి ప్రాకుదాం..." అంటూ పర్వతారోహణ ప్రారంభించాడు. అలా గంటసేపు వారి ప్రస్థానం సాగింది. రాళ్ల మధ్య నక్కుతూ కొద్దికొద్దిగా పైకి ప్రాకసాగారు. రాళ్లు మోచేతులకు గీసుకుంటూ గాయాలు చేస్తున్నాయి. చలిక్రమంగా అధికమవసాగింది. అయినా వివేక్ బృందం సాహసంగా ముందుకు వెళ్తూనే ఉంది.

ఇప్పుడు వాళ్ళు శత్రుస్థావరాలకు కనుచూపుమేరలోకి వచ్చారు.

మేజర్ వివేక్ తను ముందువెళ్తూ సంజ్ఞల ద్వారా సహచరుల్ని తనవెంట తీసుకువెళుతున్నాడు. ఆగమన్నట్లు సంజ్ఞ చేసి, శత్రుస్థావరాల మీదకు తుపాకులు గురిచేయమంటూ, తను కూడా గురిచేస్తూ "ఫైర్" అని ఆర్డర్ ఇచ్చాడు.

అంతే... శత్రుస్థావరాల మీదకు తూటాలు దూసుకువెళ్లాయి. శత్రువులు తేరుకునేలోగానే ఏడుగురు పాకిస్థాన్ సైనికులు కూలిపోయారు. మిగతావాళ్లు విజృంభించి ఎదురు కాల్పులు ప్రారంభించారు.

వివేక్ సింహంలా గర్జించాడు.

"మిత్రులారా! విజయమో, వీరస్వర్గమో... ఇవాళ మనం శత్రువుల అంతు చూడాలి..." ఉత్సాహంగా వాళ్లని పురిగొల్పాడు.

రెట్టించిన స్ఫూర్తితో వాళ్లు కాల్పులు సాగిస్తూ వివేక్‌తో బాటు శత్రుస్థావరాలవైపు వెళ్తూనే ఉన్నారు. అంతలో కొన్ని బుల్లెట్లు వివేక్‌కి తగిలాయి. శరీరం తూట్లు పడినట్లు రక్తం ధారగా కారిపోతోంది.

వివేక్‌కి అర్థమైంది. తనని వీరస్వర్గ ద్వారాలు ఆహ్వానిస్తున్నాయి. శక్తినంతా కూడదీసుకుని శత్రువుల మీదకు గ్రెనేడ్లు విసిరాడు. అంతే... అక్కడితో అక్కడ నిశ్శబ్దం అలముకుంది. సహచరులు ఆత్రుతగా అతని దగ్గరకు వచ్చారు. అప్పటికే వివేక్‌లో శక్తి సన్నగిల్లిపోయింది. "మిత్రులారా! మనం గెలిచాం. శత్రుస్థావరాలు మన వశం అయినాయి. కమేండర్‌కి యీ సంగతి చెప్పండి. నేను వెళ్లిపోతున్నాను. శత్రువుల్ని పూర్తిగా తరిమికొట్టేవరకూ మీరు విశ్రమించవద్దు. భారత్‌మాతాకీ జై..." - అతని చివరి మాటలతో ఆత్మ శరీరాన్ని వదిలివెళ్లిపోయింది. సహచరులు అతని శరీరాన్ని ఆలింగనం చేసుకుని కన్నీళ్లు కార్చారు. అంతలో వైర్లెస్ మోగింది. కమేండర్ గొంతు వినిపించింది.

ఆయనకి విషయాలన్నీ వివరించాడు ఒక సహచరుడు.

ఆయన ఆదేశాల మీద రెండు శత్రుస్థావరాలనూ స్వాధీనం చేసుకున్నారు. వివేక్‌తో బాటు మరికొందరు సైనికులు కూడా గాయాలతో కన్నుమూసారు. వారినందరినీ ఒక పక్కకు చేర్చారు సహచరులు.

ఆ స్థావరానికి మరికొంత ఎత్తుగా ఉన్న శత్రుస్థావరాల నుంచి మళ్లీ కాల్పులు ప్రారంభమైనాయి. ఆ మర్నాడు కూడా పరిస్థితి తీవ్రంగానే ఉంది. వివేక్ బృందంలోని మృత సైనికుల శరీరాలను తరలించడానికి చేసిన ప్రయత్నాలు రెండు రోజుల వరకూ శత్రువులు సాగనివ్వలేదు. ఎలాగైతేనేం జూన్ 15న భారత సైనిక బృందం పాకిస్తానీలపై జోరుగా ఎదురు కాల్పులు జరిపి, వాళ్లని కొండరాళ్ల వెనక్కి పరుగుతీసేలా చేసి, ఆ వ్యవధిలో మేజర్ వివేక్ బృందం మృతదేహాలను తొలగించారు. ఆ విధంగా మేజర్ విక్కీ ఏడు సంవత్సరాల సైనిక జీవితం - అతని జీవితంలో ముఖ్య ఘట్టాలకు ఆలవాలమైన జూన్ నెలలో పూర్తయింది. భార్య రాజశ్రీ కన్నీరుమున్నీరైంది.

జూన్ 17న వివేక్ మృతదేహం డెహ్రాడూన్ చేరింది. సైనిక గౌరవంతో అంత్యక్రియలు జరిగాయి. అవి పూర్తయిన అరగంటకి జూన్ 8న వివేక్ తండ్రికి రాసిన ఉత్తరం అందింది. 'ద్రాస్ సింహం' ఆత్మ ఆ ఉత్తరంలో దర్శనమిచ్చింది.

"నా కుమారుని చూసి గర్వపడుతున్నాను. అతను వీరమరణం పొందాడు" అన్నాడు లెఫ్టినెంట్ కల్నల్ (రిటైర్డ్) బి.ఆర్.ఎస్. గుప్తా అశ్రుతర్పణం విడుస్తూ.

ఆ మాటలు స్వర్గంలో ఉన్న వివేక్‌గుప్తాకి ఎంతో ఆనందాన్నీ, తృప్తినీ కలిగించి తీరతాయి. ●

ఈ రచనకు ఆధారం - సాయంతన్ చక్రవర్తి కథనం, శరద్ సక్సేనా ఛాయా చిత్రాలు. వారిరువురికీ రచయిత కృతజ్ఞుడు.